ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు

3★★

బుధవారం 12 జూన్ 2024

మిషన్ భగీరథ ఇంటింటి సర్వే వేగవంతం చేయాలి 6లో..

అంజన్న సన్నిధిలో అందని సెల్ సేవలు ! 5లో..

బడికి వేళాయె..



- నేడే పాఠశాలలు పునః ప్రారంభం
- ముగిసిన సెలవులు
- సమస్యలతో స్వాగతం పలుకుతున్న సర్కారు బడులు
- పంపిణీ కాని యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు
- నత్తనడకన మన ఊరు-మన బడి పనులు
- వెక్కిరిస్తున్న ఖాళీలు

జగిత్యాల అర్బన్, జూన్ 11: వేసవి సెలవులు ముగియడంతో జగిత్యాల జిల్లాలో మంగళవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. చిన్నారులు ఆటలకు స్వస్తి పలికి పాఠశాలలకు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో పాఠశాలల్లో తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అన్ని మండలాల్లో కనీస ఉపాధ్యాయులు ఉండే విధంగా చూస్తూనే అంగ్లమాధ్యమంలో తరగతులను ప్రారంభించారు. ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలల వరకు మౌలిక వసతులను కల్పిస్తూనే తరగతుల ప్రారంభానికి చర్యలు చేపట్టారు. పాఠశాలల ప్రారంభానికి ముందే పుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉండగా, పునఃప్రారంభమైన రోజు వరకు మరో మూడు మండలాల్లో ఇంకా పుస్తకాల పంపిణీ జరగకపోవడం గమనార్హం. జిల్లాకు 4,04088 బుక్స్‌తో పాటు, 381250 నోట్ బుక్స్ జిల్లాకు చేరుకొని పాఠశాలలకు చేర వేర్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. నేడు పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్న తరుణంలో ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులు, పుస్తకాలు, నోట్ బుక్‌లు అందేలా అధికారులు చర్యలు చేపట్టారు.

తూతూమంత్రంగా బడిబాట

జిల్లాలో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించేలా ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయులు పర్యటించి పోషకులను కలుస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించే విధంగా అవగాహన కల్పించారు. ఆంగ్ల మాధ్యమంలో 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నామని వివరిస్తూ పిల్లలను పాఠ శాలల్లో చేర్చుకుంటున్నారు. ప్రతి పాఠశాలలో కనీసం 20 మంది పిల్లలకు తక్కువ కాకుండా ఉండే విధంగా చర్యలను చేపట్టారు. జిల్లాలో ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో బడిబాట విజయవంతం కాలేదనే గుసగుసలు విద్యా శాఖ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి.

నత్తనడకన మన ఊరు-మన బడి

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపొందించాలని, విద్యా ప్రమాణాలు కూడా అదే రీతిలో మెరుగుపర్చాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం నిర్వహిస్తున్న మన ఊరు- మన బడి పథకం అమలులో తీవ్ర జాప్యం జరుగుతోంది. నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. అయినప్పటికీ జిల్లాలో మన ఊరు- మన బడి కార్యక్రమం కింద గతంలో చేపట్టిన పాఠశాలల పనులు నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరం లోనూ విద్యా ర్థులకు ఇబ్బందులు తప్పని పరిస్థితి నెలకొంది.

జిల్లాలో గత రెండో ఏడాది మార్చిలో కార్యక్రమ పనులు ప్రారంభించగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని పాఠశాలల్లో పనులు ప్రారంభం కాగా, మరికొన్ని పునాది దశలోనే ఉన్నాయి. ఈ పనులు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ద్వారా రూ.30 లక్షలకు పైబడిన పనులు టెండర్ల ద్వారా కాంట్రాక్టర్‌లు చేపట్టారని సమాచారం. పనుల పురోగతిపై ఉన్నతాధికారులు ఉరుకులు, పరుగులు పెట్టించిన క్షేత్ర స్థాయిలో మాత్రం పనులు నత్తనడకన సాగుతుండడంతో జిల్లాలో ఈ యేడాది పాఠశాలల ప్రారంభం నాటికి కూడా విద్యార్థులకు వసతులు మెరుగయ్యే పరిస్థితి లేకపోవడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా మన ఊరు- మన బడి కార్యక్రమం కింద మొదటి విడతగా 274 పాఠశాలలు ఎంపికవగా, జిల్లాకు రూ. 116.33 కోట్లు నిధులు కేటాయించారు. ఇప్పటి వరకు సుమారు 20 బడుల్లో మినహా మరెక్కడా పనులు పూర్తి కాలేదు. మన ఊరు-మన బడి కార్యక్రమం ద్వారా కొన్ని పాఠశాలల్లో మరమ్మతులు చేపడతున్నా చాలా పాఠశాలల్లో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని జిల్లాలో అమ్మ ఆదర్శపాఠశాలల కమిటీలను ఏర్పాటు చేసి, ఎంపిక చేసిన పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టగా, 591 పాఠశాలలు జిల్లాలో ఎంపికవగా, నేటికీ కేవలం 240 పాఠశాలల్లో పనులు పూర్తవడం గమనార్హం.

జిల్లాలో 1141 సర్కారు బడులు....

జిల్లాలో మొత్తం 1141 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 188 హై స్కూల్‌లు, పీఎస్‌లు 508, యూపీఎస్‌లు 86లు, కేజీబీవీలు, గురుకుల, సంక్షేమ పాఠశాలలు ఉన్నాయి. వీటితో పాటు 300వరకు ప్రైవేట్ పాఠశాలలు ఉండగా, వీటన్నిటిలో తరగతుల నిర్వహణ నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. అన్ని పాఠశాలలు తెరవడంతో పాటు ఉపాధ్యాయులు హాజరయ్యే విధంగా ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ప్రైమరీ నుంచి జడ్పీ పాఠశాల వరకు ఉపాధ్యాయులు అందరూ బడిబాటలో పాల్గొనే విధంగా చర్యలు చేపట్టారు.

సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాలలు

జిల్లాలోని ప్రభుత్వపాఠశాలల్లో సమస్యలు వెక్కిరిస్తున్నాయి. ప్రధానంగా పాఠశాలలు తెరుచుకోనున్న వేళ ఆయా పాఠశాలల్లో పారిశుధ్య సమస్యలు వెంటాడుతున్నాయి. జిల్లాలోని పాఠశాలల్లో పనిచేసే స్కావెంజర్‌లను తొలగించడంతో పారిశుధ్యం ప్రశ్నార్థకంగా మారింది. అసలే మున్సిపల్, గ్రామ పంచాయతీల్లో కార్మికుల సమస్య ఉండగా, వారిని పాఠశాలల్లో పారిశుధ్యం చేయాలని ఆదేశాలుండగా, అసలు పాఠశాలల వైపే కార్మికులు తొంగి చూడడం లేదనే విమర్శలు వినిపి స్తున్నాయి. సరైన మౌలిక వసతులు లేక, పారిశుధ్య నిర్వహణ లేకపోవడంతో పరిస్థితి దుర్భరంగా మారింది.

ఉన్నవి కూల్చి నిర్మాణం మరిచి..

ఆందోళనలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మూడు మీడియంలు మూడు వందల యాభై మంది విద్యార్థులున్న ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి పేరిట నేలమట్టం చేసిన దయనీయ దుస్థితి ఆ పాఠశాలది. సుమారు ఏడాది దాటుతున్న పిల్లర్లకే పరిమితం అయిన పాఠశాలలో తమ చదువులు ఎక్కడ సాగాలంటూ ఆందోళన చెందుతున్నారు విద్యార్థులు. పట్టణంలోని మినీ స్టేడియం సమీపంలో గల ప్రభుత్వ పాఠశాల(బాలికలు)లో నూతన తరగతి గదుల నిర్మాణం కోసం సుమారు రూ.3కోట్ల వరకు కేటాయించారు. టెండర్ పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ గతంలో ఉన్న తరగతి గదులను కూల్చి, పనులు ప్రారంభించి పునాదుల వరకే నిర్మాణం చేపట్టి పనులు నిలిపి వేశారు. నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం అవుతున్న తరుణంలో కనీసం కూర్చు నేందుకు చెట్టునీడ కూడా లేని దుస్థితి నెలకొంది.

వెక్కిరిస్తున్న ఖాళీలు పర్యవేక్షణ లోపం

జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి మొదలు పారిశుధ్య కార్మికుల వరకు ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. పాఠశాలల్లో పరిశుభ్రత కోసం గతంలో ఉన్న స్కావెంజర్‌లను తొలగించి, వారి స్థానంలో పాఠశాలల్లో పరి శుభ్రత కోసం గ్రామాల్లో పంచాయతీ కార్మికులు, పట్టణాల్లో మున్సిపల్ కార్మికులతో శుభ్రం చేయించాలని ఆదేశాలు ఇచ్చింది అప్పటి ప్రభుత్వం. కానీ ఆశించిన స్థాయిలో గ్రామ, పట్టణ పాలకవర్గాల నుంచి సహకారం అందకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్‌లను నియమించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు. జిల్లా ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు జిల్లాకు డిప్యూటీ డీఈవో పోస్టు ఊసే లేదు. జిల్లాలో 20 మండలాలు ఉండగా ఒక్క రెగ్యులర్ ఎంఈవో లేకపోవడం గమనార్హం. జిల్లాలో 188 హై స్కూల్‌లలో సగం హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉండగా, అందులో నుంచి ఏడుగురు హెచ్‌ఎంలను 18 మండలాలకు ఎంఈవోలుగా కేటాయించారు. దీంతో సగం హెచ్‌ఎంలలో కూడా మరో ఏడుగురు హెచ్‌ఎంలు ఎంఈవోలుగా నియమితులవడం గమనార్హం. మొత్తం 3293 మంది ఉపాధ్యాయులుండగా, సుమారు రెండు వందలకు పైగా ఖాళీలు ఉండడంతో సమస్యలు మరింత జటిలమైంది. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఈ సారైనా బదిలీలు, పదోన్నతులకు మోక్షం ఉంటుందా అనే భావనతో ఉపాధ్యాయలోకం ఆందోళన చెందుతోంది.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో పనిచేయాలని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌లు అన్నారు. మంగళవారం పట్టణంలోని జడ్పీ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ అధ్యక్షతన జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలను నిర్వహించారు. విద్య, వైద్య, మహిళా శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి పనులు, ఇతర అంశాలపై సమీక్షా సమావేశాలను నిర్వహించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అధికారులు ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. జిల్లాలో విద్య, వైద్యం, వ్యవసాయం తదితర రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రఘువరన్, పలువురు జడ్పీటీసీ సభ్యులు, స్థాయి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంకు సభ్యుల ఓటరు తుదిజాబితా విడుదల

కరీంనగర్ టౌన్, జూన్ 11: ది కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికలను నిర్వహించేందుకుగాను జిల్లా సహకారశాఖ అధికారులు తుది ఓటరు జాబితాను విడుదల చేసినందున ఆ జాబితాను బ్యాంకులో అందుబాటులో ఉంచినట్లు బ్యాంకు సీఈవో ఎన్.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, జగిత్యాల బ్రాంచిలకు చెందిన సభ్యులు ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నయా లేదో తెలుసుకోవాలని సూచించారు. ఒకవేళ జాబితాలో తమ పేర్లు లేనట్లయితే ఈనెల 21లోగా సరైన ఆధారాలతో బ్యాంకులో సంప్రదించి పేరు చేర్పించుకోవచ్చని అన్నారు. ఆ తర్వాత ఓటరు జాబితాలో పేరు చేర్చుతామని, సభ్యులు 9182317970 నెంబర్‌కు ఫోన్ చేసి ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిరుపేద విద్యార్థులకు వరం బెస్ట్ అవైలబుల్ స్కీం

జిల్లా అదనపు(రెవెన్యూ) కలెక్టర్ రాంబాబు



విద్యార్థులచే డ్రా తీయిస్తున్న అధికారులు

జగిత్యాల అర్బన్, జూన్ 11: ప్రతిభ కలిగిన నిరుపేద విద్యార్థులకు ప్రైవేట్ స్కూళ్లలో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బెస్ట్ అవైలబుల్ స్కీం ఒక వరం లాంటిదని జిల్లా అదనపు(రెవెన్యూ) కలెక్టర్ రాంబాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ కింద దరఖాస్తులు స్వీకరించి, మంగళవారం జిల్లా అదనపు(రెవెన్యూ) కలెక్టర్ రాంబాబు, జిల్లా సంక్షేమ అధికారి రాజ్‌కుమార్ సమక్షంలో లక్కీ డ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1వ తరగతి నాన్ రెసిడెన్షియల్ లో 119 ప్రవేశం కోసం దరఖాస్తురాగా, సరైన ధృపపత్రాలు లేని 18 దరఖాస్తులను తిరస్కరించామన్నారు. 75 సీట్ల కేటాయింపునకు గానూ, 25 మంది బాలికలను, 50 మంది జనరల్ విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. 10 మంది విద్యార్థులను వెయిటింగ్ లిస్టుగా ఎంపిక చేశామన్నారు. అలాగే 5వ తరగతి రెసిడెన్షియల్ ప్రవేశం కోసం 125 మంది దరఖాస్తులు రాగా సరైన ధృపపత్రాలు లేని కారణంగా 2 దరఖాస్తులు తిరస్కరించారు. 76 సీట్లు కేటాయించగా, 25 మంది బాలికలకు, 51 మంది విద్యార్థులు సైతం లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేశామన్నారు. 10 మంది విద్యార్థులను వెయిటింగ్ లిస్టుగా ఎంపిక చేశామన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, వసతిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ శాఖ సిబ్బంది, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

డిప్యూటి డీఎంహెచ్‌వో డా. శ్రీనివాస్



మందులను పరిశీలిస్తున్న డిప్యూటి డీఎంహెచ్‌వో

గొల్లపల్లి, జూన్ 11 : వర్షాకాలం ముంచుకోస్తున్న దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డిప్యూటి డీఎంహెచ్‌వో డా. శ్రీనివాస్ వైద్యారోగ్య శాఖ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం గొల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆరో గ్య కేంద్రంలో నిర్వహిస్తున్న మహిళ ఆరోగ్య కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అసుపత్రి పరిసరాలను పరిశీలిం చి ఫార్మాసీలోని మందులను పరిశీలించారు. అసుపత్రి రికార్డులను, రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని, ప్రతి శుక్రవారంను డ్రై డేగా పాటించేలా ప్రజలను చైతన్యపర్చాలని ఆదేశించారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, నీళ్ల విరేచనాలు, టైఫాయిడ్, జ్వరం వంటి సీజనల్ వ్యాధులకు సరిపడా మందులను అందుబాటులో నిల్వ ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య శాఖ సిబ్బందికి సూచించారు. మండల వైద్యాధికారి డా. నరేష్, సీహెచ్‌వో గట్టు శ్రీధర్, సూపర్‌వైజర్లు రమేష్ నరేందర్, ద్వారకా, శారద, ఫార్మసిస్ట్ లత, ఏఎన్‌ఎమ్‌లు పాల్గొన్నారు.

సకాలంలో సీఎంఆర్ అందించకుంటే చర్యలు తప్పవు

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా, అదనపు కలెక్టర్ రాంబాబు

జగిత్యాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నిర్ణీత గడువులోగా సీఎంఆర్ బియ్యం అందించకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్ రాం బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో 2023-24 సంవత్సరానికి సంబంధించిన సీఎంఆర్ చె ల్లింపులపై డిఫాల్ట్ రైస్ మిల్లర్లు, పారా బాయిల్డ్ రైస్ మిల్లర్లు, రా రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2023-24 సీజన్ వానాకాలం సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ చెల్లించుటకు ప్రభుత్వం సెప్టెంబరు వరకు గడువు ఉన్నందున రా రైస్ మిల్లర్లు, బాయిల్డ్ రైస్ మిల్లర్లు నిర్ణీత తేదీలోగా చెల్లించాలన్నారు. సీఎంఆర్ డెలివరీలపై క్షేత్ర స్థాయి సిబ్బంది ఎప్పటికప్పుడు రైస్ మిల్లులను సందర్శించి నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో జిల్లా పౌరసరఫరా అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా మేనేజర్ హతీరాం, పారా బాయిల్డ్ రైస్ మిల్లర్ల సంఘం నాయకులు, పారా బాయిల్డ్ రైస్‌మిల్లర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

అర్హులకు రుణ సదుపాయం అందించాలి

ప్రభుత్వ లక్ష్య సాధన కోసం బ్యాంకర్లు సహకారం అందించి అరులైన లబ్ధిదారులకు రుణ సదుపాలయ అందించాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశంలో సంబంధిత బ్యాంకు అధికారులు ఏజెన్సీల సంస్థలతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు సలహాలను అందించారు. జిల్లాలో మార్చి త్రైమాసికంలో వ్యవసాయ రుణాలకు సంబంధించి రూ. 3206 కోట్లు, వ్యవసాయ టర్మ్ రుణాలు రూ. 862 కోట్లు మంజూరు చేసామని తెలిపారు. వీధి వ్యాపారులకు సంబదించిన మూడు వ విడుతలో 1064 మందికి రుణం మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే సూక్ష్మ చిన్న, మధ్యతరహా రుణాల కింద రూ.439 కోట్లు, ప్రదాన మంత్రి ఉపాధి కల్పన పథకం కింద 308 మందికి మంజూరు చేసామని తెలిపారు. పీఎంఎఫ్ ఎంఈ క్రింద 240 యునిట్లు మంజూరు చేశామన్నారు. సరైన తాజా సమాచారం లేకుండా ప్రభుత్వ శాఖల అధికారులు, బ్యాంకర్లు సమీక్ష సమావేశం వస్తు శాఖ పరమైన చర్యలు తీసుకోబడుతాయని హెచ్చరించారు. జిల్లాలో ప్రైవేట్ బ్యాంకు లు కొన్ని స్కీంలతో అశించిన స్థాయిలో పురోగతి సాదించలేదని అసం తృప్తి జిల్లా కలెక్టర్ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ పోన్న వెంకటరెడ్డి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిజినల్ హెడ్ అరుణ సబిత, నాబార్డు దిలీఫ్ చంద్ర, ఆర్బీఐఎల్‌డీఓ సాయితేజ రెడ్డి, డీఆర్డీఓ సంపత్ రావు, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ లక్ష్మినారాయణ, ఎస్పీఐ రవీంద్ర సింగ్‌లతో పాలు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ప్రిన్సిపాల్స్ ఘన సన్మానం

జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా కలె క్టర్ షేక్ యాస్మిన్ బాషాను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్, సెక్టార్ ఆఫీసర్లు ఘనంగా సన్మానించారు. మంగళవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌ను పూలమాలలు, శాలువలు, పుష్పగుచ్ఛాలు అందించి సత్క రించారు. ఈ సందర్భంగా పలువురు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్ మాట్లా డారు.

జిల్లాలో ప్రశాంతంగా, పకడ్బందీగా ఎన్నికలు పూర్తి చేయడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, సెక్టోరియల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నీట్ పరీక్షను తిరిగి పకడ్బందీగా నిర్వహించాలి

ఎన్ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడు భార్గవ్



కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న నాయకులు

జగిత్యాల టౌన్, జూన్ 11 : ఇటీవల విడుదల చేసిన నీట్ పరీక్ష ఫలితాల్లో అవకతవకలు జరిగాయని తక్షణమే ఈ ఫలితాలను రద్దుచేసి తిరిగి పకడ్బందీగా నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎన్ఎస్‌యూఐ జగిత్యాల పట్టణ అధ్యక్షుడు చెట్టి భార్గవ్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్షల ఫలితాల్లో జరిగిన అవకతవకలపై ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో పట్టణ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నీట్ పరీక్ష ఫలితాల్లో 720 మార్కులకు గాను 720 మార్కులు సాధించినట్లుగా, జూన్ 14వ తేదీన ప్రకటించాల్సిన ఫలితాలను 4వ తేదీన ప్రకటించడంతోనే అవకతవకలు జరిగినట్లుగా అర్థమవుతుందన్నారు. మైనస్ మార్కులు ఉన్నప్పటికి 718, 719 మార్కులు రావడం ఆచ్చర్యం కలిగిస్తుందన్నారు. ఒకే పరీక్ష కేంద్రం నుంచి ఎనిమిది మందికి ఒకటో ర్యాంకుతో పాటు 67 మందికి ఒకటో ర్యాంకు రావడం ఇదే తొలిసారన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు అరుణ్ కుమా ర్, మనోహర్, కిషోర్, రిషి, తరుణ్, అక్బర్, మహేష్, అజయ్, రాహుల్, ఆఫ్రిది, అర వింద్, రాహుల్, ప్రణయ్, కళ్యాణ్, రవితేజ, యువజన కాంగ్రెస్ నాయకులు గుండ మధు, బీరం రాజేష్, నాగేంద్ర, రాజేష్ ఉన్నారు.

కొడిమ్యాలలో దొంగతనం

కొడిమ్యాల, జూన్ 11 : మండల కేంద్రంలోని నాగుల అఖిలకు చెందిన ఇంటిలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసినట్లు ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు అఖిల గంగాధర మండలం సర్వారెడ్డిపల్లిలోని తల్లి గారింటికి వెళ్లిపోయింది. ఆమె అత్తమ్మ ఒక్కరు స్వంత ఇంటికి తాళం వేసి పక్కన ఉన్న ఇంటిలో పడుకుంది. మంగళవారం ఉదయం ఆమె అత్త ఇంటికి వచ్చి చూసే సరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు.

ఇంటి తాళాలు, లోపల ఉన్న బీరు వాను పగులగొట్టి అందులోని వస్తువులను చిందరవందర చేశారు. బీరువాలోని 2 తులాల బంగారు చైన్, 10 తులాల వెండి పట్టగొలుసులు, ఒక బ్రాస్‌లెట్, 50 వేల రూపాయల నగదును దొంగలు ఎత్తుకు పోయినట్లు బాధితురాలు తెలిపింది. బాధితులు అఖిల పిర్యాదు మేరకు కేసు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

- బాల వికాస సంస్థ ప్రతినిధి, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ వసంత

జమ్మికుంట, జూన్ 11: మహిళల ఆరోగ్య సంరక్షణకు మెనుస్ట్రువల్ కప్‌లను వాడాలని బాల వికాస సంస్థ ప్రతినిధి, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ దోవారి వసంత అన్నారు. జమ్మికుంటలోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ఆమెజాన్ వారి ఆర్థిక సహాయంతో బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో మెనుస్ట్రువల్ కప్‌ల ఉపయోగం, వ్యక్తి గత పరిశుభ్రతపై మహిళలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా 150మంది మహిళలకు మెనుస్ట్రువల్ కప్స్‌ను అందజేశారు. అనంతరం దోవారి వసంత మాట్లాడుతూ మానవ మనుగడను శాసించే ఓ సహజ ప్రక్రియ రుతుస్రావం అన్నారు. మహిళలు బాగుంటనే సమాజం ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. మహిళలు నెలసరి సమయంలో ప్యాడ్స్ ఉపయోగించడం వల్ల క్యాన్సర్‌తో పాటు రక రకాల వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. ప్యాడ్స్ భూమిలో కరుగడానికి అనేక సంవత్సరాలు పడుతుందని, ఒకవేల కాల్చితే పర్యావరణ సమస్య తలెత్తుతుందని చెప్పారు. మెనుస్ట్రువల్ కప్స్ ఆరోగ్యానికి ఎంతో మంచివన్నారు. మహిళల ఆరోగ్యం, డబ్బు, పర్యావరణ పరిరక్షణ, సౌకర్యం, ఈ నాలుగు అంశాలను దృష్టిలో పెట్టుకొని మెనుస్ట్రువల్ కప్స్‌ను ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో బాల వికాస సంస్థ సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన, కో-ఆర్డినేటర్ కె సుమలత, ఎ స్వాతి, శాస్త్రవేత్త ప్రశాంతి పాల్గొన్నారు.

మోటార్ల విద్యుత్ తీగల చోరీ

మల్యాల, జూన్ 11: మండలంలోని వరదకాలువకు రైతులు అమర్చుకున్న పంప్‌మోటార్ల విద్యుత్ తీగలు కొన్ని రోజులుగా చోరీకి గురవుతున్నాయి. రాంపూర్ నుంచి సర్వాపూర్ శివారుల వరకు వందలాదిగా పంప్‌మోటార్లను అమర్చుకొని రైతులు సాగు చేసుకుంటున్నారు. ఇటీవల సాగు పనులు ప్రారంభం కాగా రెండు రోజులుగా మల్యాల క్రాస్ రోడ్డు ప్రాంతం నుంచి సర్వాపూర్ వరకు గల పంప్‌మోటార్ల విద్యుత్ తీగలను కట్ చేసి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళుతున్నట్లు రైతులు తెలిపారు. గతంలోనూ నూకపల్లి శివారులో విద్యుత్‌తీగలు, పంప్‌మో టార్లలోని కాపర్ తీగలు కూడా చోరీకి గురి కాగ అప్పట్లో కొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల మళ్లీ పెరుగడంతో ఆందోళన చెందుతున్నారు.

గంజాయి కాల్చివేత



గంజాయిని తగులబెడుతున్న పోలీసులు

సిరిసిల్ల క్రైం, జూన్ 11: సిరిసిల్ల పట్టణం రగుడు శివారులోని డంప్ యార్డు వద్ద జిల్లా డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో 36 కిలోల 436 గ్రాముల గంజాయిని కాల్చివేశారు. మంగళవారం రగుడు డంప్‌యార్డువద్దకు జిల్లా వ్యాప్తంగా 41 కేసులలో స్వాధీన పరుచుకున్న 36.436 కిలోల నిషేధిత గంజాయిని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతిలో కాల్చేసి బూడిద చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి వంటి మ త్తు పదార్థాలను రవాణాచేసే వారిపై పీడీ యాక్ట్ అమలు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ చంద్రశేఖ ర్‌రెడ్డి, టౌన్ సీఐ రఘుపతి, ఆర్ఐ యాదగిరి పాల్గొన్నారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూన్ 11: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,350 రూపాయలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 20మంది రైతులు 275క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు ఒక క్వింటాల్ పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,350, కనిష్ఠ ధర 4,500 రూపాయలు చెల్లించారు.

ఆరెపల్లిలో చోరీ

వేములవాడ టౌన్, జూన్ 11: ఆరెపల్లిలో సోమ వారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆరె పల్లికి చెందిన మంజెడి రాజయ్య తన ఇంటి ముందు నిద్రిస్తున్నాడు. దొంగలు ఇంట్లోకి చొరబడి రూ.15 వేల నగదు, టీవీ, సెల్ ఫోన్ ఎత్తుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన నడిగొట్ల లింగయ్యకు చెందిన సెల్‌ఫోన్‌ను, నడిగొట్ల శ్రీనివాస్‌కు చెందిన నీటి పంపును దొంగతనం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

200 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సుల్తానాబాద్, జూన్ 11: సుల్తానాబాద్ మండలం దేవునిపల్లి గ్రామంలో బేడబుడిగె జంగాల కాలనీలోని ఒకరి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసి ఉన్న రెండు వందల క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు మంగళవారం పట్టుకున్నారు. గ్రామానికి చెందిన వానరాసి నంబయ్య అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేసి ఉంచారన్న సమాచారం మేరకు అధికారులు దేవునిపల్లి గ్రామంలో దాడులు నిర్వహించి బియ్యాన్ని పట్టుకున్నారు. ఈ సందర్భంగా బియ్యం సేకరించే వారు, బుడిగె జంగాల కాలనీ వాసులు అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో సివిల్ సప్లై అధికారులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ పోలీస్ సిబ్బందితో అక్కడికి చేరుకొని అధికారులకు రక్షణ కల్పించారు. దాంతో అధికారులు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకునే కార్యక్రమాన్ని కొనసాగించారు. బియ్యం అక్రమంగా నిల్వ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అట్టి బియ్యాన్ని సుల్తానాబాద్ లోని ఎం ఎల్ ఎస్ పాయింట్ గోదాముకు తరలించారు. ఈ దాడుల్లో జిల్లా సివిల్ సప్లై అధికారులు ప్రేమ్ కుమార్, పౌరసరఫరాల సంస్థ డిప్యూటీ తహసీల్దారులు శంకర్ , రవీందర్ రాథోడ్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు మల్లికార్జునరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● సైదాపూర్‌లో..

సైదాపూర్: మండలంలోని సర్వాయిపేట గ్రామం నుంచి అక్రమంగా ట్రాలీలో తరలిస్తున్న 10 క్వింటాళ్ల రేషన్ పట్టుకొన్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు. చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన గంట వెంకటేష్ అనే వ్యక్తి మంగళవారం ఉదయం ట్రాలీలో రేషన్ బియ్యం తీసుకొని వెళ్తుడగా పట్టుకొని వాహనాన్ని సీజ్ చేసి వెంకటేష్‌పై కేసు నమోదు చేశామన్నారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఆరోగ్యం హెచ్చరించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం

అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయి పట్టివేత

- మంథని, మద్దులపల్లికి చెందిన ఇద్దరు యువకుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

మంథని, జూన్ 11: గంజాయి మత్తుకు బానిసై తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో గంజాయిని క్రమంగా రవాణా చేస్తూ, గట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు కొనసాగిస్తున్న ఇద్దరు యువలకును మంథని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు మంథని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ ఆదేశాల మేరకు.. మంథని బస్ డిపో వద్ద మంథని ఎస్‌ఐ వెంకటకృష్ణ, సీపీలు దుబ్బాసి రమేష్, ఐతు లుకాలు పెట్రోలింగ్ చేస్తుండగా ఉదయం 11 గంటల సమయంలో డిపో చౌరస్తాలో ప్లాస్టిక్ బ్యాగ్‌తో సహా ఉండి అనుమానాస్పదంగా ఉన్న క్రమంలో యువకులను అదుపులోకి తీసుకొని తహసీల్దార్ ద్వారా పంచానామా నిర్వహించి బ్యాగ్‌లో ఉన్న గంజాయిని తూకం వేయించగా 1కిలో 70 గ్రాములు ఉండగా దాని విలువ రూ.26,750 ఉన్నట్లు తెలిపారు. పట్టుబడిని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును మంథని పోలీసులు విచారించగా మంథనికి చెందని పుల్లె ప్రశాంత్, భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మద్దెలపల్లికి చెందిన చికినారపు సంతోష్‌లను నిందితులుగా తేలిందన్నారు. వీరి పై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. యువత మత్తు కోసం గంజాయి, మద్యం లాంటి వాటికి బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవ ద్దన్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల కదలిక పై దృష్టి సారించాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై స్థానిక పోలీసులకు లేదా 100 డయల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. గంజాయి నిందితులను పట్టుకోవడంలో ప్రతిభను కనబర్చిన మంథని ఎస్‌ఐ వెంకటకృష్ణ, పీసీలు దుబ్బాసి రమేష్, ఐతు లూకాలను గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ ప్రత్యేకంగా అభినందించారు.

వరి కొయ్యలు కాల్చేందుకు వెళ్లి నిప్పంటుకొని వృద్ధుడి మృతి



భూమయ్య(ఫైల్)

రాయికల్, జూన్ 11: జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో వరి కొయ్యలను కాల్చేందుకు వెళ్లి నిప్పంటుకొని ఓ వృద్ధుడు మంగళవారం మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. రాయికల్ పట్టణానికి చెందిన రైతు తోపారపు నడిపి భూమయ్య(70) సోమవారం సాయంత్రం తన పంట పొలంలో వరి కొయ్యలను కాల్చేందుకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. వరి కొయ్యలకు నిప్పు పెట్టి అక్కడే ఉండగా కొయ్యలు కాలుతూ ప్రమాదవశాత్తు వృద్ధుడికి అంటుకోవడంతో శరీరం పూర్తిగా కాలిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటి నుంచి వెళ్లిన భూమయ్య తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

పరస్పర దాడులు.. నలుగురిపై కేసు

ఎల్లారెడ్డిపేట, జూన్11: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సాయిబాబా కమాన్ వద్ద ఇరు వర్గాలు పరస్పరం దాడులకు దిగి ప్రజలకు ఇబ్బందులు కలిగించిన సంఘటనలో నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ మంగళవారం తెలిపారు. మండలంలోని రాజన్నపేట గ్రామానికి చెందిన నమిలికొండ బాలయ్య నమిలికొండ రాజవ్వ, నమిలికొండ పర్శయ్య, నమిలికొండ నిర్మల ఒకరిపై ఒకరు దాడులకు ఎగబడ్డారు. సమాచారం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడకు చేరుకుని అడ్డుకునేందుకు యత్నించారు. ఎంత చెప్పినా వినకపోవడంతోపాటు రహదారిపై వెళ్లే ప్రజలకు ఇబ్బందులు కలిగించారు. హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి ఫిర్యాదుతో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కల్యాణ కాత్యాయనీదేవి వ్రతం

మెట్‌పల్లి, జూన్, 11: పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో కాత్యాయదేవి కల్యాణవ్రతాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొంగుబంగారంగా కొలిచే పెద్దమ్మ ఆలయంగా వెలి సిన బంగారు పెద్దమ్మ, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వ్రతాలను ఆలయంలో చేపట్టారు. ఉదయం నుంచి బంగారు తల్లి అమ్మవారికి, శ్రీవల్లి దేవి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు, లక్ష్మీదేవి పూజలు ఆలయ పురోహితుడు మదన్‌శర్మ నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులతో భక్తులు పెద్దమ్మ ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. సర్ప దోష నివారణ, కల్యాణ, సంతాన దోషాల పరిహారం వంటి కార్యక్రమాలను చేయించారు. భక్తులు ఆలయం సమీపంలోని శ్రీ ఐశ్వర్యలక్ష్మీ, గోశాలలోని గోమాతలకు పూజలు చేశారు.



కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

ఘనంగా రేణుక ఎల్లమ్మ బోనాలు

మెట్‌పల్లి, జూన్ 11: పట్టణంలోని రేణుక ఎల్లమ్మ బోనాలు గౌడ కుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వ హించారు. ఆలయంలోని అమ్మవారికి అభిషేకాలు, అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. బోనాల జాతరకు మెట్‌పల్లి చుట్టు పక్క గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రానావేణి సుజాత-సత్యనారాయణలు పాల్గొని అమ్మ వారికి ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు బోనం ఎత్తుకుని పట్టణంలోని చావిడి వద్ద ఉన్న భూమాత ఆలయం నుంచి డప్పు చప్పులతో శివసత్తుల పూనకంలో ఊరేగింపుగా ఆలయానికి తరలి వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే భక్తులతో కలిసి బోనం నెత్తిన ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. జాతరలో గౌడ శెట్టి, పంబాల పూజారుల ఎల్లమ్మ వేషధారణ, పోతురాజుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గౌడ కుల సంఘం అధ్యక్షుడు పూదరి సుధాకర్‌గౌడ్, పూదారి నర్సాగౌడ్, చెర్లపల్లి మీనా, చెర్లపల్లి సుఖేందర్‌గౌడ్, ఎనుగందుల శ్రీనివాస్, వనజ, చెర్లపల్లిలక్ష్మీ, రాజేశ్వర్‌గౌడ్, పుల్ల చిన్నయ్యగౌడ్, పూదరి శ్యాంసుందర్‌గౌడ్, పూదరి రామ్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, ఏనుగందుల గోపిగౌడ్, భక్తులు, కుల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామంలో రేణుక ఎల్లమ్మ బోనాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డోలు వాయిద్యాల మధ్య బోనాలతో మహిళలు గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. బోనాలు నెత్తిన పెట్టుకొని గ్రామ శివారులోని ఎల్లమ్మ గుడికి చేరుకొని బోనాలు, ఒడి బియ్యాన్ని సమర్పించారు. గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పైడిపల్లి ఆనందం, కౌన్సిలర్ బొంగోని వీరన్న, అయోధ్య బుర్ర సంపత్, పైడిపల్లి మల్లిఖార్జున్, పొన్నం వెంకటరమణ, పైడిపల్లి పెద్ద భీమయ్య, బొంగోని సదానందం, పైడిపల్లి తిరుపతి, గట్టు సదయ్య, పంజాల రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

భక్తులతో పోటెత్తిన కొండగట్టు

- ఇబ్బందులు కలుగకుండా అధికారుల చర్యలు



ఆలయ ఆవరణలో భక్తజనం

మల్యాల, జూన్ 11: కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో పోటెత్తింది. వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకోవడంకు బారులు తీరగా అంజన్నను దర్శించు కొని ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారి దర్శనంకు గంట సేపు పైగా సమయం పట్టింది. విద్యార్థుల వేసవి సెలవులు ముగుస్తుండ డం తో తరలివచ్చిన భక్తులు అంజన్న దర్శనం అనంతరం బేతాళుడు, శ్రీరాముడిని కూడా దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. వై జంక్షన్ వద్ద వాహనాలతో భక్తుల రాకపోకలకు అసౌకర్యంగా మారింది. భక్తులు వచ్చిన వాహనాలతో ఘాట్‌రోడ్డు నిండిపోయింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

క్రీడలతో దేహదారుఢ్యం పెంపొందుతుంది

-పీసెట్ కన్వీనర్ రాజేష్‌కుమార్



మాట్లాడుతున్న పీసెట్ కన్వీనర్ రాజేష్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 11: క్రీడలతో దేహదారుఢ్యం, శారీరక పటుత్వం లభిస్తాయని ఫిజికల్ ఎడ్యుకేషనల్ కమాన్ ఎంట్రన్స్ టెస్ట్ (పీసెట్) కన్వీనర్ రాజేష్‌కుమార్ అన్నారు. శాతవాహన యూనివర్సిటీ మైదానంలో మంగళవారం తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్టు శారీరక పరీక్షలను రెండో రోజు ఆయన ప్రారంభించి మాట్లాడారు. 470మంది అభ్యర్థులు శారీరక సామర్థ్య పరీక్షలలో పాల్గొన్నారని తెలిపారు. అనంతరం హాజరైన అభ్యర్థులకు వంద మీటర్ల పరుగు, లాంగ్ జంప్, షాట్‌పుట్, హైజంప్‌లతో పాటు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ క్రీడాంశాలలో నైపుణ్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పీడీ జె ప్రభాకర్ రావు, శాతవాహన యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ డాక్టర్ నిజాముద్దీన్ మునవర్, శాతవాహన యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ విజయ్‌కుమార్, పీడీలు శ్రీధర్ రావు, నాగేశ్వర్‌రావు, బాలరాజు, పన్యాల శ్రీనాథ్‌రెడ్డి, రవీందర్, అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో యువకుడి హఠాన్మరణం



వినయ్‌కుమార్(ఫైల్)

వేములవాడ టౌన్, జూన్ 11 : కుటుంబ సభ్యులతో కలిసి రాజన్న ఆలయానికి వచ్చి న ఓ యువకుడు తీవ్ర ఒత్తిడికి లోనైన హఠన్మారణం పొందిన సంఘటన వేములవాడ పట్టణంలో మంగళవారం విషాదాన్ని నింపింది. జనగామ జిల్లాకు చెందిన బొట్ల ఇస్తారి, లక్ష్మీ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం రాజన్న ఆలయానికి వచ్చారు. పెద్ద కుమారుడి కూతురి పుట్టు వెంట్రుకలు తీసి రాజన్నను దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం చిన్న కుమారుడు బొట్ల వినయ్‌కుమార్(24)కు ఛాతిలో నొప్పిగా ఉండడంతో గదిలోనే ఉంచి కుటుంబ సభ్యులు బద్దిపోచమ్మ దర్శనానికి వెళ్లారు. ఈ క్రమంలో ఛాతీలో నొప్పి కాస్త తీవ్రం కావడంతో మెడికల్ షాపునకు వెళ్లి ఓఆర్‌ఎస్ ప్యాకెట్ కొను గోలు చేసి వస్తుండగా అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికుల సహాయంతో అంబులెన్స్‌లో ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వినయ్ మృతి చెందినట్లు పేర్కొన్నారు.

ముడుపుల సామగ్రి వేలం

మల్యాల, జూన్ 11: కొండగట్టులో ఇటీవల జరిగిన పెద్ద హనుమాన్ జయంత్యుత్సవాల సందర్భంగా దీక్షపరులు సమర్పించిన ముడుపుల సామగ్రికి దేవస్థానం అధికారులు మంగళవారం వేలం నిర్వహించారు. ఈ వేలంలో మిశ్రమ బియ్యం కిలో రూ.23 చొప్పున, ఇత్తడి గంటలు కిలోకి రూ.440 చొప్పున, ఎండు కుడుకలు కిలో రూ.70చొప్పున వేలంలో పాల్గొన వారు ధర నిర్ణయించడంతో వాటిని ఖరారు చేశారు. మాలలకు రూ. 3.66లక్షలు, కొబ్బరికాయలకు రూ.60వేలు పలికినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్, చంద్రశేఖర్ ఆలయ అధికారులు తదితరులు ఈ వేలం కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో అందని సెల్ సేవలు !

- భక్తులకు అందుబాటులో బీఎస్ఎన్ఎల్ మాత్రమే
- ఉన్నతాధికారులకు విన్నవించినా స్పందన శూన్యం

మల్యాల, జూన్ 11: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో సెల్ సేవలు భక్తులకు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సెల్ కంపెనీలు కొండపైన సేవలు అందించకపోవడంతో అసౌకర్యానికి గురవుతున్నారు. అంజన్న దర్శనానికి గాను ఇక్కడకు నిత్యం వేలల్లో, ప్రతి మంగళ, శనివారాల్లో ఇరవై వేలకు పైగా హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా లక్షలాదిగా భక్తులు వస్తుంటారు. ఇక్కడ బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ తప్ప మిగితా కంపెనీల సెల్ సేవలు లేకపోవడంతో ఊసురుమంటున్నారు. కొండపైన గల బీఎస్ఎన్ఎల్ సేవలు కూడా అంతంతమాత్రమే కాగ రద్దీ రోజుల్లో సామర్థ్యం మించిపోవడంతో సేవలకు అంతరాయం ఏర్పడడంతో మరింత ఇబ్బంది పడుతున్నారు. ఈ రోజుల్లో ఉక్కువ మంది ప్రైవేట్ కంపెనీల సెల్‌సేవలు పొందుతుండగా ఇక్కడ వారికి సంబంధించిన ఎలాంటి సెల్‌సేవలు అందుబాటులో లేవు. దీంతో కొండపైకి వచ్చే భక్తుల సెల్‌ఫోన్‌లు ఇక్కడకు చేరుకోగానే మూగబోతున్నాయి. కొండపైన చిన్నారులు తప్పిపోయే సంఘటనలు, బంధువులు, కుటుంబసభ్యులు ఇతరాత్రా సమాచారం తెలుసుకోవడం భక్తులకు కష్టంగా మారింది.



కొండపైన ఉన్న సెల్‌వన్ టవర్

● సేవలన్నీ ఆన్‌లైన్.. సెల్ ఆఫ్‌లైన్

సెల్‌ఫోన్ ఆధారంగానే సేవలన్నీ ప్రజలుకు అందుబాటులోకి రాగ కొండపై సెల్‌సేవలు లేకపోవడంతో దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇక్కట్లు పడుతున్నారు. ఇక్కడకు మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు. ఈ మధ్య కాలంలో డబ్బుల చెల్లింపులు, ఇతరాత్ర లావాదేవీలు అంతా సెల్‌ఫోన్ ఇంటర్‌నెట్ నుంచే జరుగుతున్నాయి. నగదు లేకుండానే అన్ని జరుగుతుండగా కొండపైన కూడా భక్తులు దుకాణాలలో వస్తువులు, పూజసామగ్రి తదితర కొనుగోళ్లలో యూపీఐ పేమెంట్స్ చేస్తుంటారు. అయితే ఇక్కడ బీఎస్ఎన్ఎల్ మినహా మిగిత సెల్ సేవలు అందుబాటులో లేకపోవడంతో డబ్బుల కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని సందర్భాల్లో భక్తులు సెల్ సిగ్నల్స్ కోసం, చెట్లు, బండరాళ్లు ఎక్కాల్సిన దుస్థితి నెలకొంది. సెల్‌సేవలు విస్తృతంగా భక్తులకు అందుబాటులోకి తీసుకురావడానికి అధి కారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

పత్తి, కూరగాయల సాగుపై రైతులకు అవగాహన



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి

మల్యాల, జూన్ 11: పత్తి, కూరగాయల సాగుపై వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి మంగళవారం జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రైతునేస్తం కార్యక్రమం ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పత్తి అధిక సాంద్రతతో సాగు గురించి డా.ప్రశాంత్ వివరించగా పద్మశ్రీ గ్రహీతలు సీహెచ్ వెంకటరెడ్డి, పి.వెంకటేశ్వర్‌రావు, రైతు శంకర్ తమ అనుభవాలను తెలిపారు. అలాగే సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు గురించి వివరించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా వ్యవసాయ అధికారి వాణీ, ఎంపీపీ ఏ.రవళి, మండల వ్యవసాయ అధికారి కె.చంద్రదీపక్, ఏఈవోలు మంజుల, ప్రశాంత్, కారుణ్యకుమార్, శ్రీనివాస్, ప్రశాంత్ రైతులు తదితరులు పాల్గొన్నారు

ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

పెగడపల్లి, జూన్ 11: ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని నంచర్ల గ్రామంలోని ప్రాచీన దేవాలయమైన శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని మంగళవారం అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకుని ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు ఒరుగల శ్రీనివాస్, నాయకులు చాట్ల విజయభాస్కర్, సతీష్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, కడారి తిరుపతి, పూసాల తిరుపతి, నంది మల్లారెడ్డి, శ్యామ్‌సుందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కొత్త శ్రీనివాస్, అంజయ్య, విష్ణు, గంగారాం, వంశీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిలో బీజేపీ నాయకుల సంబరాలు



మెట్‌పల్లిలో స్వీట్లు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు

మెట్‌పల్లి, జూన్, 11: కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారం లోకి రావడంతో మెట్‌పల్లిలోని బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని మీజీ ఎమ్మెల్యే తుమ్మల వెంకటరమణరెడ్డి నివాసంలో బీజేపీ నాయకులు స్వీట్లు తినిపించుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. దేశ ప్రధానమంత్రిగా మూడో సారి నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరణ, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి బొగ్గు గనుల శాఖ మంత్రిగా, బండి సంజయ్ హోం సహాయక శాఖ మంత్రిగా నియమకం హర్షం వ్యక్తం చేశారు. పార్టీని అభివృద్ధి పథంలో నడిపించిన నాయకులకే మంత్రి పదవులు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఇల్లెందుల కృష్ణమాచారి, గడ్డ రాజారెడ్డి, తొగిటి ఎంబేర్‌మాన్లు, కొండ్లెపు శ్రీనివాస్, గంప శ్రీనివాస్, అంబల్ల జగన్, కోటగిరి ప్రభాకర్, నిర్మల్ శ్రీనివాస్, మార్గం గణేష్, తదితరులు పాల్గొన్నారు.

చెరువులను కబ్జాదారుల నుంచి రక్షించాలి

టీపీసీసీ ఫిషర్మెన్ రాష్ట్ర కార్యదర్శి పల్లికొండ ప్రవీణ్

మెట్‌పల్లి, జూన్ 11: రాష్ట్రంలోని గ్రామాల్లోని చెరువులు, కుంటలను కబ్జాదారుల నుంచి రక్షించాలని టీపీసీసీ ఫిషర్మెన్ రాష్ట్ర కార్యదర్శి పల్లికొండ ప్రవీణ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం పట్టణంలోని సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పరిపాలన వైఫల్యం వల్ల గ్రామాల్లో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు అక్రమ కబ్జాదారులకు వరంలాగా మారిందన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి వల్ల భూ కబ్జాదారులు అక్రమంగా భూములను తమ పేరు మార్చుకున్నారని ఆరోపించారు. నాడు వందల ఎకరాలలో చెరువులు ఉంటే కనీసం పది ఎకరాలు కూడ లేవని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులు, కుంటలు కబ్జాకు గురువతున్నాయని తహసీల్దార్, జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేసి సమస్యలను వివరించినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని సర్వేలు చేపట్టి కబ్జాకు గురైనా చెరువులు, కుంటల భూములను రక్షించాలని కోరారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

మున్సిపల్ కమిషనర్ తిరుపతి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ తిరుపతి

కోరుట్ల, జూన్ 11: అంటు వ్యాదులు నివారణపై పారిశుధ్య సిబ్బంది ప్రత్యేక చర్యలు చెపట్టాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతి సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులు, ఆటో డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు సలహాలను అందించారు. చెత్త సేకరణకు ఆటో డ్రైవర్లు డోర్ టూ డోర్ కలెక్షన్ నిర్వహించి తడి పొడి చేత్తను సేకరించాలన్నారు. వర్షకాలం దృష్టిలో పెట్టుకోని అంటు వ్యాధులు ప్రబలకుండా వార్డులోని రహదారులపై ఉన్న చెత్తను వెంటది వెంట తొలగించాలన్నారు. వార్డు ప్రజల నుంచి ఎలువంటి ఫిర్యాదు రాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ డ్రైవర్లు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నాణ్యమైన తినుబండారాలను విక్రయించాలి

నాణ్యమైన తినుబండారాలను విక్రయించాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతి హోటల్, బేకరీ, స్వీట్ హోం యజమానులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని పలు హోటల్, బేకరీ, స్వీట్ హోంలను మున్సిపల్ అధికారులు పరిశీలన జరిపారు. నిలువ ఉన్న తినుబండారాలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారికి జరిమానాలను మున్సిపల్ అధికారులు విధించారు. వినియోగదారులకు తాజా ఆహారం అందించే విధంగా యజమానులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్ , రమేష్ పాల్గొన్నారు.

వానమ్మా..రావమ్మా..

- వర్షాల కోసం అన్నదాత ఎదురుచూపు
- దుక్కులు, నారుమడులు సిద్ధం
- విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతన్న



దుక్కులు సిద్ధం చేసిన రైతులు

కథలాపూర్, జూన్ 11 : నైరుతి రుతుపవనాలు దోబూచులాడుతున్న నేపథ్యంలో రైతన్న వానల కోసం ఆకాశం వంక చూస్తున్నారు. జూన్ రెండో వారం దాటిపోతున్నప్పటికీ వానలు కురవకపోతుండడంతో అన్ని సిద్ధం చేసుకున్న అన్నదాత నిరాశ చెందుతున్నాడు. వర్షాలు ఈ ఏడు పుష్కలంగా కురుస్తాయని వాతావరణ శాఖ బులెటిన్ విడుదల చేస్తుండగా ఎన్నో ఆశలతో ఉన్నారు. అయితే మబ్బులు కమ్ముకుంటున్నా వానల జాడ లేకపోవడం వల్ల రైతాంగం కలత చెందుతున్నాడు.

ఎరువులు, విత్తనాలతో సాగుకు సిద్ధం

ఖరీఫ్ సీజన్‌కుగాన రైతాంగం ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసి సాగు కోసం అన్ని రకాల సిద్ధంగా ఉన్నారు. ఈ సీజన్‌లో వరి సాగు 19 వేల ఎకరాల మేర జరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 3 వేల ఎకరాలు కంది, పెసర, మినుము, పల్లి వంటి పంటలు సాగు చేస్తారని అంచనా. వరిలో అధిక దిగుబడులు రావడానికిగాను రైతులు ఇప్పటికే 993 క్వింటాళ్ల జీలుగ, జనుము విత్తనాలు వేసుకున్నారు. అదేవిధంగా చెరువు మట్టి, కోళ్ల దాన, ఆవు పేడ వంటి సేంద్రియ ఎరువులు వేసుకుని సిద్ధంగా ఉన్నారు. పలు గ్రామాల్లో నారు కోసం మడులు సిద్ధం చేసుకోవడం కనిపిస్తోంది. వానలు ముందుగా కురిస్తే విత్తనాలు సాగు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. అనుకున్న సమయానికి విత్తనాలు విత్తుకుంటే అధిక దిగు బడులు వస్తాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా చూశాం: శేఖర్, ఏఈవో



ఈ ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు, ఎరువులకు కొరత లేకుండా చూశాం. ప్రణాళిక ప్రకారం ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తే అందుకనుగుణంగా విత్తనాలు, ఎరువులు సరఫరా చేయడానికి వీలు ఏర్పడింది. రైతాంగం వానల కోసం ఎదురుచూస్తున్నారు. సమయానికి వానలు కురిస్తే దానికగుణంగా విత్తనాల సాగుకు ఎంతో అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. దిగుబడులు కూడా అధికంగా వచ్చే అవకాశం ఉంటుంది.

మిషన్ భగీరథ ఇంటింటి సర్వే వేగవంతం చేయాలి

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



చల్‌గల్ లో ఇంటింటి సర్వే పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

జగిత్యాలరూరల్, జూన్ 11 : మిషన్ భగీరథ ఇంటింటి సర్వే ద్వారా సేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామంలో మిషన్ భగీరథ ఇంటింటి సర్వే పనులను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే టీమ్ లు ప్రతి ఇంటికి వెళ్లి మిషన్ భగీరథ కనెక్షన్ ఇచ్చిన ఇంటి యజమాని పేరు, కుటుంబవివరాలు, ఆధార్ నెంబర్, కులం ఇంటిలో నివసిస్తున్న వారి జనాభా, నల్లా ఏవిధంగా వస్తున్నది, ఇంటి యజమాని ఫొటో, నల్ల వలన ఏమైన సమస్యలు ఉన్నాయా వంటి అంశాలను సేకరిస్తుందని తెలి పారు. వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 1169 లాగిన్స్ ద్వారా పంచాయతీ కార్యదర్శులు, విఓలు, సీసీలు, ఫీల్డ్ సహాయకులు, గ్రామ, మండల పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో సర్వే చేస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతంలో 2,21283 ఇండ్లకి గాను ఇప్పటి వరకు 30, 787 ఇండ్ల సర్వేపూర్తి చేశామని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవరాజు, ఎంపీడీఓ రమాదేవి, ఎంపీవో రవిబాబు పాల్గొన్నారు.

గొల్లపల్లి : ఇంటింటికి నల్లా నీరు ఇవ్వాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం అమలు చేసిన మీషన్ భగీరథ పథకం పై అధికారులు, సిబ్బంది మంగళవారం ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మీషన్ భగీరథ పథకంలో భాగంగా ఇంటింటికి నల్లాలు వేశారా.. ఇంటింటికి నల్లా నీరు అందుతుందో లేదోనని వివరాలు అడిగితెలు సుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మీషన్ భగీరథ పథకం పై ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీవో సురేష్‌రెడ్డి తెలిపారు. ఇంటింటి సర్వేకు వచ్చే అధికారులకు, సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సురేష్‌రెడ్డి, కార్యదర్శి రాజకిషన్, అంగన్‌వాడీ టీచరు తాండ్ర రమాదేవి, కారోబార్ గణేష్, సీఏలు గంగాలక్ష్మీ, గంగాలక్ష్మీ, సువర్ణ, లక్ష్మీ తదితర ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండి సేవలందించాలి

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమేష్

బీర్‌పూర్, జూన్ 11: గతంలో లాగానే మండల ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి సేవలందించాలని ఎంపీపీ మసర్తి రమేష్ అన్నారు. మంగళ వారం బీర్‌పూర్ మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో ఎంపీపీ మసర్తి రమేష్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభకు హాజరైనా అధికారులు మూడు మాసాలలో చేపట్టిన పనులను ప్రగతిని చదివి వివరించారు. మండలం లోని 15 గ్రామాలకు సర్పంచ్‌ల పదవి కాలం ముగియడంతో గ్రామాల పాలన సౌలభ్యం కోసం ప్రత్యేకాధికారులను నియమించారు. గ్రామాలలోని సమస్యలను సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించి అధికారులు, గౌరవ సభ్యుల దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉండగా, ఆ అధికారులే డుమ్మా కొట్టడం పట్ల ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ సమయంలో ట్రాన్స్‌కో పై సమీక్ష జరుగుతున్న సమయంలో ఎంపీడీవో లచ్చాలు అధికారుల తీరుపై మండిపడ్డారు. ప్రభుత్వం, అధికారులు ఎంతో కష్టపడి హరితహారంలో మొక్కలు నాటితే ట్రాన్స్‌కో అధికారులు చెట్లను నరికివేస్తున్నారని, ఇకపై అలాంటి సంఘటనలు జరిగితే జరిమాన వేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతం ఎంపీపీ మాట్లాడుతూ తమ పదవీ కాలం వచ్చే నెల 4తో ముగుస్తుందని గుర్తు చేస్తూ అధికారులు ఎప్పటి మాదిరిగానే ప్రజలకు సేవలందిస్తారని ఆశిస్తున్నామన్నారు. గడిచిన కాలమంత నిధులు లేక కేవలం ఉత్సవ విగ్రహాల మాదిరిగానే ముగిసిందని, ప్రజాప్రతినిధులుగా ఉన్నా లేకున్నా ప్రజలకు తమ వంతు సేవలు అందిస్తామన్నారు. గడిచిన ఐదేళ్ల పాటుగా తమకు సహకరించిన మండల ప్రజలకు, మండల అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అనంతం పదవికాలం ముగియడంతో సర్వ సభ్య సమావేశం కారణంగా ఎంపీడీవో లచ్చాలు ఎంపీపీ రమేష్, జడ్పీటీసీ పద్మ, వైస్ ఎంపీపీ లక్ష్మన్ రావ్, కో-ఆప్షన్ మెంబర్ బీబా, ఎంపీటీసీలు రంగు లక్ష్మన్, ఆడెపు మల్లీశ్వరి, గొర్ల సృజనలను శాలువాలతో సన్మానించి మెమోంటోలు అందించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీవో రామకృష్ణ రాజ్, ఆర్ఐ శ్రీనివాస్, సూపరిండెంట్ రాజమౌళి, సింగిలివిండో చైర్మన్ నవీన్‌రావ్, ఏవో అనూష, ఏఈలు విజయ్, వసీమ్, వెటర్నరి డాక్టర్ సునీల్, అంగన్‌వాడీ సుపర్‌వైజర్ నీలిమ, ఇన్‌చార్జి ఏపీ ఎం రమేష్, హెల్త్‌సూపర్‌వైజర్ కిషోర్ పవర్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ చిహ్నం మార్పు కోసం వినతి

కథలాపూర్, జూన్ 11 : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ చిహ్నం మార్పు కోసం మంగళవారం తహసీల్దార్ ముంతాజీబోద్దీన్‌కు ధర్మ సమాజ్ పార్టీ నాయకులు వినతి పత్రం అందించారు. ఇటీవల చేసిన మార్పులను తాము స్వాగతిస్తున్నామని అయితే ప్రపంచంలో ప్రసిద్ధి గాంచిన ఉస్మానియా యూనివర్శిటీ, రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ చిహ్నాలను చేర్చాలని కోరారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తమ జీవితాలను పణంగా పెట్టిన సమ్మక్క, సారక్క, సర్వాయి పాపన్నల ఫోటోలు కూడా పెట్టాలని కోరారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రమేష్ మహారాజ్, కమ్మరిపల్లి మండల అధ్యక్షుడు కైలాశ్ మహరాజ్, రాజేందర్, కోటేశ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా తెలంగాణ దశాబ్ది సంబరాలు

కోరుట్ల రూరల్, జూన్ 11 : దుబాయిలో సోమ, మంగళవారాలు తెలంగాణ దశాబ్ది వేడుకలను దుబాయి ఏటిసాలట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించారు. దుబాయి దేశంలో ఈ ప్రాంతానికి చెందిన గల్ఫ్ కార్మికులు ప్రత్యేకంగా ఏటిసాలట్ అకాడమీగా ఏర్పడి వేడుకలను నిర్వహించారు. తెలంగాణ సాధనలో అమరులైన వారికి నివాళులు అర్పించి తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో వేడుకలను నిర్వహించారు. తెలంగాణ కళాకారులు సోనీ యడర్ల, ఎల్ మహేష్, మాపల్లె శంకర్ దుబాయి సింగర్ మల్లేష్ కోరేవుల తెలంగాణ ఉద్యమ పాటలతో కార్యక్రమాన్ని నిర్వహించి వేడుకలను జరిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న అందెశ్రీ, ప్రకాష్, వినయ్‌బాబు, నంగి దేవేందర్‌లను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిదులు మాట్లాడుతూ దుబాయి దేశంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పాన్సర్స్‌గా వ్యవహరించిన వారితో పాటు అతిదులు కళకారులను నిర్వహకులు సన్మానించి అభినందించారు.

ఘనంగా సాయి ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

ప్రత్యేక పూజలు చేసిన ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్



ఆలయంలో పూజలు చేస్తున్న లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి, జూన్ 11 : మండలంలోని చెందోళి గ్రామంలోని శ్రీ సాయి ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర్ రావు ఆధ్వర్యంలో వార్షికోత్సవాన్ని కన్నులపండువలా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారుల వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారికి గణపతి పూజ, హోమం కార్యక్రమాలను భక్తిశ్రద్దలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రత్యేక పూజలు చేసిన లక్ష్మణ్ కుమార్ :

ఆలయం వార్షికోత్సవంను పురస్కరించుకుని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శ్రీ సాయి ఆంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర్ రావు, స్థానిక పార్టీ నాయకులు, ఆలయ పూజారులు పూర్ణాకుంభాభిషేకంతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం గర్భగుడిలోని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయగా ఆలయ పూజారులు ఆశీర్వచనాలు అందించి లడ్డూ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కిష్టంపాట రమేష్‌రెడ్డి, గ్రామ పెద్దలు, నాయకులు, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు,

దొంతాపూర్‌లో బడి బాట ర్యాలీ

ధర్మపురి, జూన్ 11: ధర్మపురి మండలంలోని దొంతాపూర్ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు బట్టూరి రాజేశం ఆధ్వర్యంలో గ్రామంలో గల దొంతాపూర్ చెరువు వద్ద ఉపాధి హామీ పనులు నిర్వ హిస్తున్న కూలీల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో పి ల్లలను చేర్పించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లా డుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచ డం కోసం బడి బయట పిల్లలను చేర్పించడమే లక్ష్యంగా విద్యా శాఖ బడి బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఐదేళ్ల వయస్సు నిండిన పిల్లల వివరాలను సేకరించి, వారి తల్లిదండ్రులను కలిసి ప్రభు త్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటా రని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు బట్టూరి రాజేశం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ పర్జనా, ఉపాధ్యాయులు బండారి సతీష్, గజె ల్లి సునీత, దుబ్బాసి అనిత, చుంచుకాల సింధూజ, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి నివేదికలు సిద్ధం చేయాలి

మల్యాల, జూన్ 11: మండలంలో రెండేళ్లుగా చేపట్టిన అభివృద్ధికి సంబంధించిన నివేదికలు సిద్ధం చేయాలని ఎంపీపీ ఆగంతపు రవళి అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారిగా నివేదికలు సిద్ధం చేస్తూనే రాబోయో రోజుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి ప్రణాళిక లను త్వరిత గతిన రుపొందించాలని సూచించారు. అంతకు ముందు మల్యాలలోని ఒడ్డెర కాలనీ, బీసీ కాలనీలో గల ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి వాణి, ఎంపీడీవో స్వాతి, ఏవో చంద్రదీపక్, వెటర్నరీ అధికారి రాజ్‌కుమార్, ఏపీఎం రాజయ్య పాల్గొన్నారు

స్కూల్ యూనిఫామ్స్ అందజేత

పెగడపల్లి, జూన్ 11 : పెగడపల్లి మండల విద్యాధికారి కార్యాలయానికి మంగళవారం మండల మహిళా సమాఖ్య ద్వారా స్కూల్ యూనిఫామ్స్ అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తుల కుట్టడానికి గాను బతికపల్లి గ్రామంలోని అరు ణోదయ గ్రామసంఘం ఆధ్వర్యంలోని సోనియా స్వశక్తి సంఘానికి అప్పగించారు. ఈ మేరకు 1654 డ్రెస్సులను కుట్టి మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో అప్పగించారు. కార్యక్రమంలో ఏపీఎం సమత, సీసీ శశికుమార్, ఆపరేటర్ రాము, ప్రదీప్, మండల సమాఖ్య కార్యదర్శి పద్మ తదితరులు ఉన్నారు.

పోలీసు చట్టాల పై కళాజాతా

గొల్లపల్లి, జూన్ 11 : గొల్లపల్లి మండలం మల్లన్న పేట గ్రామంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసు చట్టాల పై పోలీసు బృందాలచే కళాజాత ప్రదర్శనను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, మూఢ నమ్మకాలు, రోడ్డు ప్రమాదాలు, డ్రగ్స్ వంటి వాటి పైన, పోలీసు చట్టాల పై కళాజాత ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఎస్సై చిర్ర సతీష్ కుమార్ మాట్లాడుతూ ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు పోలీసు కళాబృందం చే గ్రామాల్లో ప్రజలకు పోలీసు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

మృతుని కుటుంబానికి పోలీస్ శాఖ అండ

జగిత్యాల టౌన్, జూన్ 11 : జగిత్యాల జిల్లాలోని కోడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ గుండె పోటుతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు కుటుంబానికి పోలీస్ శాఖ అండగా నిలిచింది. కార్పస్ ఫండ్ కింద మంజూరైన రూ. 50 వేల విలువగల చెక్కును మంగళవారం మృతుడి భార్యకు ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా అందజేశారు. జూనియర్ అసిస్టెంట్ సత్యం తదితరులు ఉన్నారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

మల్యాల, జూన్ 11: మండలంలోని బల్వంతాపూర్ శివారులో నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న అయిదు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు. ఈ మేరకు డ్రైవర్లతో పాటు పలువురుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

రాయికల్, జూన్ 11: మండలంలోని ఒడ్డెలింగాపూర్ బాలికల మినీ గురుకులంలో 1వ తరగతిలో 30 సీట్లు, 5వ తరగతిలో 10 సీట్ల ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ గురుకుల ప్రాంతీయ సమన్వయాధికారి డిఎస్ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల గిరిజన విద్యార్థినుల తల్లిదండ్రులు ఈ నెల 18లోగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు. 1వ తరగతి విద్యార్థులకు ఐదేళ్లు నిండి ఉండాలన్నారు. ఇతర వివరాలకు 8333925362, 9502150241 లలో సంప్రదించాలని పేర్కొన్నారు.



బోనాల శోభయాత్రలో పాల్గొన్న మహిళలు

ఘనంగా ఎల్లమ్మ బోనాల జాతర

కోరుట్ల రూరల్, జూన్ 11: మండలంలోని పైడిమడుగు గ్రామంలో మంగళవారం గీత కార్మికుల ఆధ్వర్యంలో ఎల్లమ్మ మారుబోనాల జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గీత కార్మికులు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో భాగంగా ఎల్లమ్మకు మారుబోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకొని శోభాయాత్ర నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల గుండా బోనాల జాతర నిర్వహించంగా శోభాయాత్రలో పోతరాజుల నృత్యాలు అకట్టుకున్నాయి. మహిళలు బోనాలను ఎల్లమ్మకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు కురిసి పంటలు విరివిగా పండి కుల వృత్తులు సక్రంగా నిర్వహించేందుకు వాతావరణం సకారం అందించాలని పూజలను జరిపారు.

ధర్మపురి క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ

ధర్మపురి, జూన్ 11: ధర్మపురి క్షేత్రంలో మంగళవారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. సెలవు దినాలు కావటం వల్ల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. క్షేత్ర నలుమూలల నుండి భారీగా భక్తులు తరలి వచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. స్వామి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లోకి ప్రవేశించారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. అందంగా పూలతో స్వామి వారల ను అలంకరణ చేశారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేశ్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రో చ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి పాల్గొన్నారు.